# కన్యావ్రతం

- కె.కె.భాగ్యశ్రీ

నన్ను ఆ ఊర్లో దింపేసి దుమ్మురేపుకుంటూ సాగిపోయింది బస్సు. 'సీతానగరం' పచ్చని బోర్డుమీద నల్లని అక్షరాలు కొట్టొచ్చినట్లుగా, ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఎక్కడా ఇళ్లుకాని, జనసంచారం కాని కానరావడంలేదు.

ఎలా వెళ్లాలి? ఎటువెళ్లాలి? అన్నీ తికమక సందేహాలే.

ఎవరో పల్లెవాసి అటుగా పోతూంటే పిలిచి,

"సుగుణమూర్తిగారింటికి ఎలా వెళ్లాలి?" అడిగాను.

అతను నావైపోసారి పరికించి చూసి, "ఈ కాలబాటంటే ఎల్లిపోండి.. ఊరొత్తాది. అక్కడకు పోయి ఎవుర్నడిగినా సెప్తారు.." అని వెళ్లిపోయాడు.

అతను చెప్పినవైపు చూసిన నాకు సన్నని ఇరుకైన కాలిబాట దర్శనమిచ్చింది.

భగవంతుడా.. ఇప్పుడీ ఇరుకుదారిలో పడి పోవాలా!

బస్‌లో కూర్చుని కూర్చుని అసలే కాళ్లు నొప్పులు పెడుతున్నాయి. ఆ నొప్పులు తీరాలంటే పాదాలకు పని చెప్పాల్సిందే.

సూట్‌కేస్ చేతిలోకి తీసుకుని, బ్యాగ్ భుజాన తగిలించుకొని 'ఈసురో వాసుదేవా' అంటూ నడక ప్రారంభించాను.

ఓ పది, పదిహేనడుగులు వేశానోలేదో, నా ఎదురుగా ఓ నూనూగు మీసాల కుర్రవాడు సైకిల్‌తో సహా వచ్చి ఆగాడు.

ఆ అబ్బాయి ముఖంలో రాధ పోలికలు స్పష్టంగా అగుపిస్తున్నాయి.

"మీరు.. మీరు.. జ్యోతీ ఆంటీయేనా" అడిగాడు ఆ కుర్రాడు.

చిక్కితే పాలుగారే తెల్లని చెంపలమీంచి చెమట ధారలుగా కారుతోంది.

"ఆఁ నువ్వు రాధ కొడుకువా?"

"అవునాంటీ.. మీరొస్తారు, బస్‌దగ్గరకు వెళ్లమని అమ్మ ప్రొద్దున్నే చెప్పింది. ఏదో హడావుడిలో పడి మరచిపోయాను. సారీ ఆంటీ."


ఆ చిన్నవాడి మాటల్లో ఎంతో వినయం.. ముగ్ధురాలినైనాను.

"ఆ లగేజ్ ఇలా ఇవ్వండాంటీ! సైకిల్ మీద పెడతాను. మీరు నెమ్మదిగా నడవండి.. మరీ ఎక్కువ దూరం లేదులెండి.." అంటూ చొరవగా నాచేతిలో సామాను అందుకొని సైకిల్ వెనక క్యారియర్ మీద పెట్టాడు.

"నీ పేరు..?" అంతవరకు నా చేతులు ఇబ్బందిగా మోసిన బరువు సైకిల్‌ని అధిరోహించగానే, రిలీఫ్ ఫీలవుతూ అడిగాను.

"కళ్యాణ్.." నడక సాగిస్తూనే చెప్పాడా అబ్బాయి.

దారిపొడుగునా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ ఊరు



చేరాం ఎలాగైతేనేం.

"అదుగో.. ఆ ఎత్తరుగుల ఇల్లే మాది!" అన్నాడు కళ్యాణ్ ఉత్సాహంగా చేత్తో చూపిస్తూ.

పాతకాలంనాటి ఎత్తరుగుల ఇల్లు. కొత్తగా వెల్లవేయడంతో తళతళ మెరిసిపోతోంది. ఇంటి ముందు ఆవరణనంతా కవర్‌చేస్తూ వేసిన తాటాకుల పందిరి, పచ్చని మామిడి తోరణాలతో రమ్యంగా ఉంది. పందిరిని నిలబెట్టిన రాటల చుట్టూ ఎర్రమన్నుతో బోదెలుకట్టి, వాటిమీద సున్నం పట్టీలు, జేగురురంగు పట్టీలు వేశారు. వాకిలంతా పేడకళ్లాపు జల్లి, పిండితో ముగ్గులు వేశారు. పందిరినిండా కట్టిన మామిడాకుల పచ్చివాసన, ఎంతో హాయిగా సోకింది నా ముక్కుపుటాలకు. ఇంత అద్భుతమైన అనుభూతి ఎక్కడుందీ రోజుల్లో.

ఏదో.. హడావుడిగా రెండు షామియానాలు వేసేయడం, నాలుగు రకాల విద్యుద్దీపాలు అమర్చేయడం.. ముష్టివాళ్లలా వరుసగా ప్లేట్స్ పట్టుకొని నిలబడి బఫే డిన్నర్స్ చేసేయడం. అంతా యాంత్రికం.. అక్కడ ఎటువంటి అనుభూతులకీ తావులేదు.

కాని, ఎడారిలో అలసి సొలసిన ప్రయాణీకునికి దప్పిక తీర్చే ఒయాసిస్సులా.. ఈ మారుమూల పల్లెల్లో అప్పుడప్పుడు తెలుగింటి సాంప్రదాయాలు కనువిందు చేస్తూనే ఉంటాయి.

తృప్తిగా అనిపించింది నా మనసుకి.

నన్ను చూస్తూనే "ఏయ్.. జ్యోతీ.. ఇంత లేట్‌గానా రావడం. ఓ రెండ్రోజులు ముందొస్తే నీ సొమ్మేంపోయిందీ.." నిష్ఠురత మాటున దాగిన, ఆత్మీయతతో నన్ను కౌగలించుకుంది రాధ. అప్పటికీ.. ఇప్పటికీ రాధలో ఏ మార్పూ లేదు. కాకపోతే సన్నగా, రివటలా ఉండే రాధ కాస్త ఒళ్లు చేసి నిగారింపును సంతరించుకుంది.

"బాగున్నావా చెల్లెమ్మా!" రాధ భర్త సుగుణమూర్తి గారు పలకరించారు.


ఆయనకి నమస్కరించాను నేను.

"మిగిలిన వాళ్లందరూ ఏరి?" నా వెనుకగా వెతుకుతూ అడిగింది రాధ.

"సారీ రాధా! మీ అన్నయ్యకి ఏదో అర్జెంటు కాన్ఫరెన్స్ ఉందని చెన్నై చెక్కేశారు. పిల్లలేమో పరీక్షలు దగ్గరకొస్తున్నాయి రామనేశారు. వాళ్లకి అన్నీ అమర్చిపెట్టి నేనిల్లు కదిలేసరికి.. ఇదిగో.. ఇలా ఆలస్యమైంది."

నేనిచ్చిన సంజాయిషీ రాధను తృప్తిపరచలేదని దాని వదనమే తెలిపింది. అయినా నవ్వుతూ నన్ను లోపలికి తీసుకెళ్లింది.





## రాణీ అంతరంగం

ఆశ మనిషికి కొత్త జీవాన్నిస్తుంది. భవిష్యత్తు గురించిన ఆశ వర్తమానాన్ని ముందుకి నడిపిస్తుంది. అతి సామాన్యుల నుంచి కోట్లకు పడగలెత్తిన వారూ తమకేదో కావాలని ఆశపడుతుంటారు. సినిమాతారలు తమ ఆశల్ని తమ క్యారక్టర్ల ద్వారా నెరవేర్చుకుని సంతృప్తిచెందుతుంటారు. హీరో, హీరోయిన్లు తాము చిరకాలం నుంచి ఆశిస్తున్న క్యారెక్టర్లు లభిస్తే ఎంతో సంతోషిస్తారు. 'రైల్లో ప్రయాణిస్తూ యూరోప్ అంతా చూడాలని ఉంది. ప్రశాంతంగా ఉండే పల్లె అందాలని వీక్షించాలని, నదుల్లో జలకాలాడాలని ఉంది. ఎత్తైన కొండల్ని చూస్తూ కాలాన్ని మరచిపోవాలని ఉంది' అంటూ కవితా ధోరణిలో తన కోరికల్ని బయటపెట్టింది రాణీ ముఖర్జీ. వెరీగుడ్ రాణీ! కమేరాల్లో బంధించే కృత్రిమఅందాల్ని ఎంత సేపు ఆస్వాదిస్తాం. సింపుల్‌గా ఉన్న నీ ఆశలు త్వరలో నెరవేరాలని అంతా కోరుకుంటున్నారు.

ఇల్లంతా బంధుమిత్ర సపరివారాలతో సందడిగా ఉంది. వారందరికీ నన్ను పరిచయం చేసింది రాధ.

రాధ అత్త, మామలకు నన్ను పరిచయం చేసింది. వాళ్ళకి పాదాలంటి నమస్కరించాను.

పండు వృద్ధులైన రాధ తల్లిదండ్రులు మొదట నన్ను గుర్తుపట్టలేదు.

కాని, గుర్తించిన పిమ్మట వారి సంబరం అంబరాన్ని అంటింది. ఆనందం అర్థవమైంది.

అందరూ కనబడుతున్నారుకాని, అసలు క్యాండిడేట్.. అదే పెళ్లికూతురు అలికిడి మాత్రం ఎక్కడా లేదు.

అదేమాట రాధను అడిగాను.

"ఓ.. సాకేతా.. కన్యావ్రతంలో ఉంది."

"కన్యావ్రతమా!" నోరెళ్లపెట్టాను అర్థంకాక.

"ముందు నోరుమూయి తల్లీ.. దోమలో, ఈగలో దూరగలవు. ఈ వ్రతమేదో వింతగా ఉంది కదూ. ఈ వ్రతం ఈ ఊరికి మాత్రమే స్పెషల్." అంది నవ్వుతూ.

"అదేంటి?" అన్నాను నేను విచిత్రంగా చూస్తూ.

"అదంతా చెప్పాలంటే ఓ పెద్ద చరిత్ర అవుతుంది. వినేందుకు నీకు ఓపిక ఉన్నా చెప్పేందుకు నాకు తీరికలేదు. తాపీగా వివరిస్తాలే." అంది రాధ నన్ను స్నానపానాదులకు తొందరచేస్తూ.

మరేం మాట్లాడక దాన్ననుసరించాను.


అయినాసరే.. సందేహం నా మెదడును కుమ్మరిపురుగులా దొలుస్తూనే ఉంది.

కన్యావ్రతమా! అలాంటి నోమొకటి ఉందని నేనింతవరకూ విని ఉండలేదు. ఈ ఊరికి మాత్రమే ఈ వ్రతం స్పెషల్ అని రాధ చెప్పూనే ఉంది. బహుశా ఏ గౌరీ పూజలాంటిదేనేమో ఇది కూడా.

కాఫీ, టిఫిన్‌లయ్యాక నాకేర్పాటు చేసిన గదిలో విశ్రమించాను. గదంతా నీట్‌గా, అందంగా సర్ది వుంది. గదిలో ఓ మూలగా ఉన్న టేబుల్‌పైనున్న ఫోటోలోంచి ఓ పద్దెనిమిదేళ్ల పడుచు చిరునవ్వులు చిందిస్తోంది. ఆమే సాకేత కాబోలు.

రాధ వచ్చిందింతలో... ఆరాత్రే పెళ్లేమో... ఒకటే కంగారు పడిపోతోంది.

ఆడపిల్ల పెళ్లి చేయబోతున్న ఆనందంలో ఒకటే టెన్షన్ దానికి.




"ఒసేయ్ జ్యోతీ! ఇది మా సాకేత గది. నీట్‌గా ఉంటే నీకిష్టమని దీన్ని నీకిచ్చింది. ఎలా ఉంది?"

"సింప్లీ సుపర్బ్. గుడ్ టేస్ట్.." అభినందించాను సాకేత అభిరుచికి అనుగుణంగా అలంకరించిన గది చూసి.

"సరే.. రాత్రి పదకొండు నలభైకి ముహూర్తం ఇంకా బోలెడు పనులున్నాయి.. నిన్ను పట్టించుకోలే దని మాత్రం అనుకోకేం.." అంది రాధ మాటల్లో ఆప్యాయత కురిపిస్తూ.. స్నేహపుష్పం గుబాళింపులు సుతిమెత్తగా ఉంటాయి నిత్య నూతనంగా.

"అలా అనుకోనుగాని.. నాకూ ఏదైనా పని చెప్పు.. ఆఁ అన్నట్లు సాకేతని అలంకరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయా.. సాకేత ఎక్కడుంది ఇంతకీ.. పడుకొని.. పడుకొని బోర్ కొట్టిందేమో, ఏదైనా పని కల్పించుకుందికి చూశాను నేను.

"ఆఁ అన్నిపన్లూ చేయడానికి అందరూ ఉన్నారు. నువ్వనవసరంగా హైరానాపడకు. ఓ పనిచేయి.. దాని మేకప్ అంతా నువ్వు చూసుకో." అంది రాధ మాటలు దొర్లిస్తూ.

"ఇంతకీ సాకేత ఎక్కడుందో చెప్పనేలేదూ" రెట్టించాను నేను.

"అయ్యో నామతిమండా! చెప్పనేలేదు. సాకేత రత్నం పిన్నిగారింట్లో ఉంది" అంది రాధ.

నాకు తెలియని ఈ రత్నం పిన్ని ఎవరబ్బా! ఇంతకీ ఆవిడెవరు? అడగబోయి, పనిభారంతో సతమతమవుతున్న రాధను మరివిసిగించడం ఇష్టంలేక ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

"ఏయ్ జ్యోతీ! రెస్ట్ తీసుకుంటావా.. బయకొస్తావా!"

"పదవే.. ఒంటరిగా కూర్చొని బోర్‌కొడుతోంది.. అలా అందరిలోకీ వచ్చి ఏదోపనిలో అన్వయించుకుంటేగాని తృప్తిగా ఉండదు.. రాధ వెంట బయటకు నడిచాను.

★ ★ ★

పెళ్లిపందిరంతా ఒకటే కోలాహలం.. సందడి.. నాలుగు వసారాల మండువా లోగిలి. మధ్యలో ఉన్న విశాలమైన ఓపెన్ ప్లేస్‌లో వీధిలోలాగే తాటాకుల పందిరి వేశారు. వివాహవేదికను అందంగా డెకరేట్ చేశారు.

చిరుమందహాసాల మధ్యన తమ పెళ్లినాటి ముచ్చట్లన్నీ తలుచుకుంటూ ఆహ్వానితులకివ్వాల్సిన తాంబూలం పాకెట్లను సిద్ధం చేస్తున్నారు ముత్తయిదువులందరూ. నేనూ వారితో కలిసిపోయాను.

పెళ్లికి వచ్చిన లేబ్రాయపు తుంటరి చిన్నవాళ్లు, పదారు పరువాలతో తుళ్లిపడే చక్కని చుక్కలకి సైటుకొడుతున్నారు పదే పదే క్రాపులు సవరించుకుంటూ.

వాళ్లని కవ్విస్తూ, అందీ అందకుండా మురిపిస్తూ నయగారాలొలకపోస్తున్నారు వయ్యారి వన్నెలాడులు.

ఆ వాతావరణమంతా ఎంతో సందడిగా, మనోజ్ఞంగా ఉంది. పిడికెడంత నా గుండెల్లో, దాచలేనంత అనిర్వచనీయమైన సంతృప్తి ఇమిడిపోయింది.

ఆరు దగ్గరవుతూండగా సాకేతని తీసుకొచ్చారు

కొందరాడవాళ్లు. సాకేతది పూర్తిగా తండ్రి పోలికను కుంటా. సుగుణమూర్తిగారిలాగే సున్నితంగా ఉంది.

ముట్టుకుంటే మాసిపోయే అపరంజి బొమ్మలా ఉంది సాకేత.

సాకేతని అలంకరించే బాధ్యత నాపైనే వేసుకున్నాను. అందాలొలికే చంద్రబింబంలా తయారుచేశాను సాకేతను.

"ఈవిడేలే రత్నంపిన్ని" రాధ పరిచయం చేసింది సాకేతను వెంటతీసుకువచ్చిన ఆడవాళ్లలో ఒకావిడని చూపిస్తూ.

నలభయ్యయిదు, యాభై మధ్యవయస్సున్న ప్రౌఢ ఆమె. పచ్చని శరీరఛాయ, ఆకాశంలో పొడిచిన సూర్యబింబంలా నుదుట వెలిగే కుంకుమ బొట్టు, ఎర్రటి వెంకటగిరి జరీచీర.. శరీరంలో నుండి యవ్వనం ఇంకా వైదొలగనని మారాం చేస్తోందేమో ననిపించే శరీరపు జిగి.. బిగి.. వెరసి ఒక సుందర రూపమే రత్నం పిన్ని.

నమస్కరించాను నేను.

పెళ్లి ముహూర్తానికి సమయం కావడంతో ఆవిడతో మరి మాట్లాడే అవకాశం కలగలేదు నాకు.

సాకేతకి కాబోయే మొగుడు కూడా చాలా అందంగా ఉన్నాడు.

రకరకాల ఛలోక్తుల మధ్య, సుసాంప్రదాయంగా పెళ్లి వేడుక జరిగిపోయింది.

తలంబ్రాలు, నాగవిల్లి.. అరుంధతీ దర్శనం, అప్పగింతలు మొదలైన వేడుకలన్నీ కళ్లకింపుగా జరిగిపోయాయి.

ఏ తెల్లవారు ఝామో అయ్యుంటుంది మేమందరం నడుం వాల్చేసరికి.

* * *

ఈ రాత్రికే సాకేతకి శోభనం.

ఫస్ట్‌నైట్‌కి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. కార్యం గదిని సుసజ్జితంగా సిద్ధం చేశారు.

నేను, రత్నంపిన్ని, మరికొంతమంది కలసి సాకేతని శృంగారించే కార్యక్రమం చేపట్టాం.

ఈ హంగామా కనినంతనే, ప్రతి ఇంతికి తన తొలిరాత్రి తంతంతా తలపుల కదలాడక మానదు.

చిరుసిగ్గు దొంతరల మధ్యనే, అమ్మలక్కలందరూ చిన్న చిన్న గొంతులతో గత స్మృతులను నెమరువేసుకుంటున్నారు.

అదొక అనుభూతుల పరంపర.. ఆనందాల తుప్పర.

తొలిరాత్రనేది స్త్రీ జీవితంలో మరచిపోలేని మధుర జ్ఞాపకం.

ఆ రాత్రి క్రొత్తజంట బ్రతుకంతా గుర్తుంచుకునే సుగంధ పరిమళాలు వెదజల్లాలంటే.. ఇటువంటి హంగులన్నీ అవసరమేనేమో...

"ఇప్పుడు కన్యావ్రతానికి ఉద్యాపన చేయించాలి" అంది రాధ.

కార్యం పీటల మీద కూర్చొనేముందే, సాకేతచేత ఉద్యాపన చేయించారు.

ఏదో ఫోటో ముందు సాకేత చేతులు జోడించి కూర్చొని ఉంది.

ఆ ఫోటో ఏదో చూద్దునుకదా.. చెరకువింటి నారిని సంధించి, సుమశరాలను కురిపిస్తున్న మన్మథుడు, అతని ప్రక్కనే ప్రియపత్ని రతీదేవి.

ఒక్కసారిగా ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయాను.

ఎప్పుడూ, ఎక్కడా కనీ, వినని క్రొంగొత్త సంఘటన.. రతీ, మన్మథుల చిత్రానికి పూజలు చేయడం ఇదివరలో నేనెక్కడా చూడలేదు.

నా ఆలోచనల్లో నేనుండగానే, రత్నంపిన్ని సాకేత చేత అందరికీ వాయినాలిప్పించింది.

పాల నురుగులాంటి తెల్లని జరీ చీర, జాకెట్టు, జాజులు, మల్లెలు కలిపి చుట్టిన పొడుగాటి పూలజడలో.. పసిడికాంతులీనే బుగ్గపై నల్లటి కాటుక చుక్క.. అందాల సాకేత వెండి చందమామలా మెరిసిపోతోంది.

సాకేతని గదిలోకి పంపే తతంగం అంతా పూర్తయ్యింది. సాకేత గదిలోకి వెళ్లేముందు పరిశీలించి చూశాను.

ఆమె వదనంలో స్త్రీ సహజమైన సిగ్గు, బిడియాలు తప్ప, అనవసర ఆందోళన.. కంగారు.. తొట్రుపాటు మచ్చుకైనాలేవు.

ఈ కాలపు ఆడపిల్లకదా.. దాంపత్య జీవితం గురించి మంచి అవగాహనే ఉండి ఉంటుంది.

పేరంటాళ్లు, చుట్టాలు కూడా ఎవరిళ్లకి వారు జారుకున్నారు.

భోజనాలైనాక దిండు పట్టుకుని మేడపైకి వెళ్లాను నేను.

క్రిందన రాధ ఏదో పనిలో ఉంది.. దాన్ని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక నేనొక్కర్తినే వెళ్లాను.

నిండు చంద్రుడు, ఆకాశ మధ్యన వ్రేలాడే వెండి దీపాల గుత్తిలా ఉన్నాడు. కొబ్బరి ఆకుల సందుల నుండి సన్నని చారలుగా జారే నెల వెన్నెల తెల్లగా మెరుస్తోంది అక్కడక్కడ.

ప్రియవిభుని స్పర్శలా, శరీరాన్ని నిమ్ముతూ, పలకరిస్తోంది చల్లనిగాలి.


అలా తలగడమీద తలాన్చి పడుక్కున్నాను నేను.

పడుక్కున్నానన్న మాటేగాని, ఇక్కడ ఎదురైన ఈ వింత అనుభవమే మెదడును దొలుస్తోంది.

'కన్యావ్రతం'! పేరే విడ్డూరంగా ఉంది.

ఎన్నడూ వినని ఈ పేరు.. కనని ఈ తీరు.. నన్నింకా సంభ్రమంలో ముంచెత్తుతూనే ఉంది.

"ఏంటే ఆలోచిస్తున్నావు?" రాధ




## బిచ్చగాళ్ల కోసం గైడ్

టూరిస్ట్‌ల కోసం గైడ్‌లు ఉంటారని మనందరికీ తెలిసిందే. మరి అదే బిచ్చగాళ్ళకోసం గైడ్‌లు ఉంటారంటే నమ్ముతారా? రోమ్ నగరంలో ఇటీవల బిచ్చగాళ్ళకోసం గైడ్‌లు పుట్టుకొచ్చారుట! రాత్రివేళ ఎక్కడ నిద్రపోవడానికి ప్లేస్ దొరుకుతుంది, స్నానం ఎక్కడ వీలవుతుంది, వాటర్ ప్రాబ్లమ్ ఏ ఏరియాలో ఉండదు, అన్నదాన శిబిరాలు ఏ ప్రదేశాల్లో వున్నాయి, చీకటి పడేవేళ మాదాకోళం ఎక్కడ దొరుకుతుంది... లాంటి విశేషాలు, ఏ ఏ స్వచ్ఛంధ సంస్థలు ఏ ఏ సమయాల్లో బిచ్చగాళ్ళకు సహకరిస్తాయో గైడ్‌లు తెలుపుతున్నారట. వీరిద్వారా వెంటనే అక్కడకు చేరుకుని హాయిగా అడుక్కోవచ్చున్నమాట.

బిచ్చగాళ్ళ పనే హాయిగా ఉంది కదూ! అయితే ఈ గైడ్‌ల వలన మరింత మంది సోమరిపోతులు తయారవుతారేమోనని అనుకుంటున్నదట అక్కడి ప్రభుత్వం. నిజమే! ఇన్ని సదుపాయాల్ని చూసి బిచ్చగాళ్ళు మరింత పెరుగుతారంటే ఏమాత్రం సందేహంలేదు.

– శశి





## దొంగతనాలు తగ్గాయి!

"సార్.. ఈమధ్య ఇళ్ళలో దొంగతనాలు బాగా తగ్గాయి. ఏ పద్ధతి పాటించారో చెప్పగలరా?" ప్రశ్నించాడు విలేకరి.

"గొప్పతనం నాదికాదయా.. టి.వి. ఛానల్స్‌ది" చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"అదెలా సార్!"

"ఏముంది, ఈమధ్య టీవీ ఛానల్స్ 24 గంటలూ ప్రసారమవుతున్నాయి. దానివలన ప్రజలు మెలకువగా ఉండటంతో దొంగతనాలు జరగటంలేదు."


– పి.డేవిడ్ (టెక్కలి)

## చెయ్యరు

"నువ్విలా వారానికి రెండ్రోజులు నాగాలు పెట్టడం మానకపోతే నిన్ను తీసేసి వేరే మనిషిని పెట్టుకుంటా" పనిమనిషితో కోపంగా అంది తాయారు.

"అది జరిగే పని కాదులెండి. అయ్యగారందుకు ఒప్పుకోరు. ఆయన శీలం మీద నాకు నమ్మకముంది. ఆయన నాకెప్పటికీ ద్రోహం చేయరు" ప్రశాంతంగా అంది పనిమనిషి.

– భానుకిరణ్ (సికింద్రాబాద్)



పిలుపుతో తుళ్లిపడ్డాను.

తనూ ఒక దిండు తెచ్చుకొని వచ్చింది రాధ.

బడలికతో ఆమె ముఖం వాడి ఉంది. అయినా, అమ్మాయి పెళ్లి చేసిన సంతృప్తితో కళ్లు మెరుస్తున్నాయి.

"ఏమీలేదు... నువ్వేంటి ఇలా వచ్చేశావు? పాపం... మా అన్నగారు ఎదురుచూస్తుంటారేమో.." అన్నాను కొంటెతనాన్ని నా గొంతులో మేళవిస్తూ.

"అంత సీనేమీ లేదు.. ఆయనగారు ఒళ్లు నొప్పులంటూ ఇందాకే మంచమెక్కేశారు" గల గల నవ్వింది రాధ.

నేనూ శృతి కలిపాను.

"నువ్వాలోచించేదేంటో నాకు తెలుసు... కన్యా వ్రతం గురించేగా!"

నా మనసులోమాట పట్టేసింది రాధ. ఒక ప్రియసఖిగా నా మనసు మారుమూలల్లో ఏముందో కనుక్కోగల నేర్పరి రాధ.

అవునన్నట్లుగా తలాడించాను.

"నీ డౌట్ క్లారిఫై చేయడానికేగా నేను వచ్చిందీ.. ఈ వ్రతం గురించి తెలుసుకోవాలంటే.. రత్నంపిన్ని జీవితం గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఈ వ్రతం సృష్టికర్త ఆమే." అంది రాధ బరువుగా.

గాలి కూడా ఆమె చెప్పేది వినడానికి చెవులు రిక్కించినట్లు మంద్రంగా వీస్తోంది.

★ ★ ★


"ఒసేయ్.. దుర్గాంబా.. ఎక్కడ చచ్చావే." ఆరున్నొక్క శృతిలో గావుకేక పెట్టాడు దీక్షితులు.

పదిహేనేళ్ల రత్నమాల ఉలిక్కిపడింది ఆ కేకకి.

బిక్కచచ్చిపోతూ కొంగునిండా కప్పుకొని పరిగెత్తుకుని వచ్చి, వంటింటి గడపలో నిలబడింది దుర్గాంబ.

"నీముఖం మండ.. పూజకన్ని ఏర్పాట్లు చేయడం మాని ఏ పెత్తనాలకు తగలడ్డావే.." హుంకరించాడు దీక్షితులు.

గడగడ వణికిపోతూ అతనికి అన్నీ అమర్చిపెట్టింది దుర్గాంబ. పెళ్లాన్ని అన్ని తిట్లుతిట్టి, భగవంతుడిని ఆరాధిస్తే ఆయనేం వరాలు ప్రసాదిస్తాడో అర్థం కాలేదు రత్నమాల లేత మనసుకి.




తన తండ్రి తల్లి మీద జులుంచేయడం, అధికారం చలాయిస్తూ ఆమెను కూరాకుల్లో పురుగులా దులపరిస్తూ ఏరిపారేయడం. ఇవన్నీ రత్నమాలకి ఊహ తెల్సిన దగ్గర్నుండీ కంటపడే దృశ్యాలే.. ఏరోజుకారోజు తండ్రి రౌద్రాకారం ఆమెకు భీతిగొలుపుతూనే ఉంటుంది. తల్లిపట్ల తండ్రి ప్రవర్తించే విధానం, లేత మాల పసి హృదయం మీద చెరగని ముద్రవేసింది.

భార్యాభర్తల బంధం అంటేనే ఏవగింపు కలిగేలా చేసింది.

★ ★ ★

అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది రత్నమాలకి. దాహంతో నోరంతా పిడచకట్టుకుపోయింది.

కరెంట్ పోయినట్లుంది.. బుడ్డీదీపం గుడ్డిగా వెలుగుతోంది. తడుముకుంటూనే లేచి చెంబులో మంచినీళ్లు త్రాగేసింది గటగటా.

తల్లికోసం ప్రక్కమంచం మీద చూపులతోనే గాలించింది. పడకఖాళీగా ఉంది. తల్లికోసం నలుదిక్కులా వెదికింది. అప్పుడు చెవినబడ్డాయి-

తండ్రి గదిలోంచి చిన్న చిన్న మాటలు.. పిడుగులు పడ్డట్లు వినవచ్చే తండ్రి కంఠం సుతిమెత్తగా వినిపిస్తోంది. గర్జించే మేఘం.. గుసగుసలాడినట్లుగా అనిపించింది ఆమెకు.

అసహ్యంతో రత్నమాల శరీరం జలదరించింది. అదేనా దాంపత్యం అంటే!

పగలల్లా కుక్కల్లా కాట్లాడుకొని.. రాత్రయ్యేసరికి శరీరాన్ని చల్లార్చుకునేందుకు ప్రక్కలమీద పొర్లడమేనా? పందులకీ, మనకీ తేడా ఏముంది?

ఒళ్లంతా కంపరమెత్తిపోయింది. తండ్రికెంత సిగ్గులేకపోయింది?

రోజంతా భార్యను కట్టుబానిసలా.. దాసీదానిలా చూస్తూ.. రాత్రయ్యేసరికి మాత్రం రంభలా భావించి కోరిక తీర్చుకోవడం ఎంతవరకు సమంజసం?

ఈ సంఘటన జరిగాక రత్నమాల మనసు మరీ బండబారిపోయింది.

★ ★ ★

"వద్దు.. వద్దు.. నాదగ్గరకు రావద్దు." ఏడుపుగొంతుతో కీచుగా అరచింది రత్నమాల, తొలిరాత్రి తనను సమీపిస్తున్న భర్తనుద్దేశ్యించి.

"రత్నా! ఏమైంది." అతని స్వరంలోని లాలన ఆమె చెవిదాకా రానేలేదు. తండ్రి ప్రవర్తనతో గుండెకైన గాయం అంత త్వరగా మానలేదు.

పెళ్లే చేసుకోనని భీష్మించుకు కూర్చున్న ఆమె మెడలు వంచి మరీ పెళ్లి చేశారు పెద్దలు.

"నా దగ్గరకొస్తే.. పొడుచుకు ఛస్తాను." అరిచింది భద్రకాళిలా. అలంకరించిన పూలజడను పీకేసుకుంది.. ఆభరణాలన్నీ విసిరిపారేసింది.

ఆమె భర్త దిమ్మెరపోయి, హడలిపోతూ అవతలకి పారిపోయాడు.

ఏం చెప్పాడో, ఏమో.. అతనూ, అతని బంధువులంతా తట్టబుట్ట సర్దుకొని ప్రయాణమయిపోయారు రత్నమాలకి పిచ్చని ముద్రవేసి మరీనూ.

ఫలితం.. మరిరెండేళ్లకి విడాకులు.

పిచ్చిదానిలా తయారైన రత్నమాలకి సైకియా

ట్రిక్ ట్రీట్‌మెంట్ అవసరమని భావించిన పెద్దనాన్న కొడుకైన శేషగిరి తనతోపాటు ఆమెను టౌన్‌కి తీసుకెళ్లాడు.

అక్కడ అతనిప్పించిన వైద్యసహాయం.. అతని మృదువైన మాటలు.. జీవిత భాగస్వామితో సున్నితంగా ప్రవర్తించే విధానం... ఆమెను ఓ మనసున్న మనిషిగా గుర్తించిన అతని సంస్కారం.. ఇవన్నీ రత్నమాలలోని పురుష ద్వేషాన్ని మటుమాయం చేశాయి.

భార్యాభర్తల అనుబంధం తానూహించినంత భయంకరం కాదన్న సత్యాన్ని చాటి చెప్పాయి. పుస్తకాలు, సినిమాలు, మొదలైనవాటి ద్వారా ఆమె తన విజ్ఞానాన్ని పెంచుకుంది.

అయితే ఇవన్నీ తెలుసుకునేసరికి, రత్నమాల జీవితం ఆమె చేతుల్లోంచి జారిపోయింది.

మోడువారిపోయిన బ్రతుకును తలచుకొని రత్నమాల కృంగిపోలేదు.

తనలాంటి పరిస్థితులు, ఏ ఇతర ఆడపిల్లలకెదురైనా.. వారు తనలా ప్రవర్తించి బ్రతుకు బండలు చేసుకోవలసిన అగత్యం కలగనీయకూడదనుకుంది.

ఆరోగ్యం కుదుటపడి పల్లెకు చేరాక కూడా, ఆమె తల్లిదండ్రుల దగ్గర ఉండాలని కోరుకోలేదు.

ఊర్లో అందరికీ సహాయపడుతూ, వారిచ్చే డబ్బు, సరుకులతో పొట్టపోసుకుంటూ అందరికీ తలలో నాలుకలా మిగిలిపోయింది రత్నమాల.

ఆడపిల్లలకి పెళ్లి వయసొచ్చేసరికి పిండివంటలెలా చేయాలో చెప్తారు... ఆవకాయపచ్చళ్లు.. అప్పడాలు వడియాలు తయారుచేయడమెలాగో ప్రాక్టికల్‌గా చేసిమరీ చూపిస్తారు.

కాని, తమ ప్రవర్తన మూలాన, స్వచ్ఛమైన ఆడపిల్లల మనసులమీద మసిమరకలు పడతాయని.. తమ మధ్య వెల్లివిరిసే అనురాగమే.. ఆపిల్ల సంసార జీవితానికి పునాది అనీ తెలిసొచ్చేలా కొందరు తల్లి దండ్రులు ప్రవర్తించరు.

అందుకే.. అటువంటి, తనలాంటి ఆడపిల్లల జీవితాలు వెలిగించేందుకే రత్నమాల ఈ 'కన్యా వ్రతా'న్ని ప్రారంభించింది.

అందరిళ్లల్లో పరిస్థితులు, అందరు భార్యాభర్తల అదృష్టాలు ఒకేలా ఉండవు.

ఆ ప్రభావం ఆడపిల్లల హృదయాల మీద జీడి మరకలా నిలచిపోకుండా వారిని ఎడ్యుకేట్ చేయడమే ఆ వ్రతం ప్రత్యేకత. పెళ్లికుదిరి, గోధుమరాయి పెట్టిన లగాయతు.. దాదాపు ఓ నెల, ఇరవై రోజుల పాటు ఆ పెళ్లికుదిరిన అమ్మాయిని తనింట్లోనే ఉంచుకుంటుంది రత్నమాల.

ఆ అమ్మాయికి భార్యాభర్తలంటే ఎలా ఉండాలీ.. ఎటువంటి ప్రవర్తన ఉన్న భర్తను ఎలా ఆకట్టుకోవాలీ.. అతనికేది ఇష్టమో తెలుసుకొని ఎలా ప్రవర్తించాలీ.. భర్తని ఎలా సుఖపెట్టాలి.. తనెలా సుఖపడాలీ.. తదితర అంశాల గురించి సుశిక్షితురాలైన బోధకురాలిలా వారికి తర్ఫీదునిస్తుంది రత్నమాల.

పత్రికల్లో వచ్చే శీర్షికలు,. సినిమాలు, టి.వి.ల పుణ్యమా అని ఈ రోజుల్లో కుర్రకారుకి సెక్స్ ఎడ్యుకేషన్ గురించి కూలంకషంగా వివరించనవసరం లేదు. కాని.. వారిలో అంతర్లీనంగా ఉండే సంకోచాల్ని, సందేహాల్ని మెల్లమెల్లగా పారద్రోలి.. దాంపత్యమంటే వారికి అవగాహన కలుగజేయాలి. అదే.. ఈ కన్యావ్రతం ప్రధానోద్దేశ్యం.

శృంగారానికి రారాజు మన్మథుడు. అందుకే.. ఆ మదనదేముని అనుగ్రహం కోసం.. పూజలు చేయిస్తుంది రత్నమాల.

తాను కన్యగా మిగిలిపోయినా.. తన పరిస్థితి మరే ఇతర ఆడపిల్లకీ రాకూడదని.. వారి జీవితం రంగుల కలలా సాగిపోవాలనీ.. రత్నమాల ఆశిస్తుంది.

ఆమె ఆశయానికి, ఆ ఊర్లో అందరి ఆమోదం.. ఆశీర్వాదబలం.. తోడైనాయి. ఫలితంగా.. ఓ ఇరవై మంది ఆడపిల్లలు పచ్చని జీవితం అనుభవిస్తున్నారు.

★ ★ ★

"ఇప్పుడు చెప్పు! నీ సందేహం తీరినట్లేనా?" భారంగా నిట్టూర్చి అంది రాధ. రత్నంపిన్ని దీనగాథ విని నా మనస్సెంత ఖేదపడిందో.. ఆమె చేయిస్తున్న ఈ వ్రతం అంతరార్థం.. తద్వారా వికసిస్తున్న కన్నెపుష్పాల జీవితాలు.. ఇవన్నీ తెలుసుకున్న తరువాత అంతగా ఆనందపడింది.

ఇంతమంది బ్రతుకుల్లో బంగారుకాంతులు ప్రసరింపజేస్తున్న రత్నం పిన్ని నిజంగా అభినందనీయురాలు. ఆమె సుశిక్షణ ముందు ఏ డాక్టర్ సలహాలైనా దిగదుడుపే.

వైద్య సహాయమే సరిగ్గా అందని ఈ మారుమూల పల్లెల్లో సైకాలజిస్టులు.. స్పెషలిస్టులు ఎక్కడనుంచొస్తారు?

వారందరి ప్రమేయం లేకుండా.. కేవలం మంచి మాటలతో ఆడపిల్లల్లో ఉద్భవించే పిచ్చి సందేహాలను దూరంచేసి, ఒద్దికగా సంసారం నెరపుకోవడం నేర్పించుతున్న రత్నంపిన్ని నా దృష్టిలో హిమవన్నగమంత ఎత్తుకి ఎదిగిపోయింది.

'చల్లని వెన్నెల వెదజల్లడంలో నాకు సాటి వేరెవరూ లేరు సుమా!' అని విర్రవీగుతున్న పున్నమి చంద్రుని తో.. 'నీకన్నా చల్లదనాన్ని పంచేందుకు మా ఇలలో ఒక ఇంతి ఉంది సుమా!' అని చెప్పాలనిపించింది నాకు.

★



## సెక్సీ తార

ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడానికి తారలు రకరకాల జిమ్మిక్కులు చేస్తూంటారు. దర్శకులు సినీతారల అందాలకి కొత్త భాష్యం చెబుతుంటారు. ఛాన్స్‌ల కోసం హాట్ సీన్స్‌లో నటిస్తుంటారు కొంతమంది హీరోయిన్లు. బాలీవుడ్‌లోకి కొత్తగా వచ్చిన బిపాసా సెక్సీ సీన్స్‌లో నటించడానికి ఎలాంటి అభ్యంతరాలు చెప్పడం లేదట. 'స్క్రిప్ట్ ప్రకారం అలా నటించాల్సి వస్తే కాదనను' అంటోందీ భామ. రోజురోజుకీ అందంగా తయారవుతూ కొత్త ఛాన్స్‌ల కోసం కొన్ని త్యాగాలు కూడా చేస్తోంది బిపాసా. ఈమె వైఖరిని తోటి హీరోయిన్లు విమర్శిస్తున్నా లెక్కచేయకుండా డేరింగ్‌గా ముందుకి సాగిపోతోంది. ఈమె ధోరణి కొంతమంది సెక్సీ హీరోయిన్లకి మింగుడుపడడంలేదు.

